# పుష్పించిన పువ్వు

“ఉదయగిరి”

భారతి మనస్సులో ఆలోచనలు తలెత్తాయి. గతాన్ని త్రవ్వుకొంటున్నకొద్దీ ఆవేదనతోపాటు ఆవేశం పొర్లుకొచ్చింది. లోకమంతా వేడుకలతో మునిగిపోయి వుంది. అందరి ముఖాల్లోను ఆనందం తొణికిసలాడుతూంది. భారతిలాంటి అభాగిని మాత్రం ఆపుకోలేని ఆవేదనలో, వెలికిరాలేని పెను చీకట్లోనుపడి క్రుంగిపోతూంది!

, ఎక్కడో, ఎప్పుడో విన్న ‘దీపావళి’ గీతం ఆమె జ్ఞాపకం చేసుకొంటుంది. దీపావళి! ... జగమంతటికీ దీపావళి... తనకు మాత్రం అది దుర్భరమైన శోకావళి! తమిరావళి!

వీధిలో పిల్లలు కేరింతలు కొడుతూ, టపాకాయలు కాలుస్తున్నారు. ఏవో పిచ్చిగీతాలు పాడుకొంటున్నారు, అర్థంలేని నవ్వుల్తో కబుర్లాడుతున్నారు. లోకం పోకడ తెలియని అమాయకులకు వున్న ఆనందం తనకెందుకు లేకపోవాలి? జీవనార్గాన్ని అవగతం చేసుకోవటమే పాపమా? ...అర్థంలేని ప్రశ్నలతో వేగిపోతూంది భారతి.

తన బ్రతుకిలా అవుతుందని కల్లోనైనా అనుకుందా. ఎవరు వూహించారూ? చదువుకున్న, సంస్కారంగల వరుడు దొరికాడనగానే అమ్మా నాన్నా మురిసిపోయ్యారు. ఆప్తమిత్రులు ఎంతగానో హర్షించారు. తనుకూడా ఆమోదం తెల్పింది. తన జీవితం ధన్యమైనది అనుకుంది... కాని, యిప్పుడు జరిగిందేమిటీ?... ఆ భర్తే తన్ను బహిష్కరించాడు యీనాడు. డబ్బుతో దాంపత్యానికి విలువ కట్టాడు. ధనానికి బానిసయై మానధనం విలువ తెలీక గుడ్డిగా ఆత్మవంచన చేసుకొని పుట్టింటికి తన్ను సాగనంపాడు. ఎంత నిర్దయ! ఎంత అమానుషం!

రెండేళ్ళుతాను చీకట్లోనే గడపింది. ప్రతి ఏటా దీపావళి వస్తూనేవుంది. కాని తన చుట్టు అలుముకున్న వింత చీకట్ల నడుమ ఆ దీపాల వెలుగు చూపు ఆనటంలేదు...రోజురోజుకు నిశాపతి జర్జరమై కాంతిహీనుడై పోతున్నట్టు ఆమె బాధపడుతుంది. మూసుకున్న కళ్లకు మరేమి కన్పిస్తుందీ అంధకారం తప్ప?

“నీతో చదువుకున్న కామాక్షి చూడు ఎంత ముచ్చటగా కాపురం చేసుకుంటుందో! నీకా భాగ్యంలేకపోయింది” అంటూ అమ్మ కంట తడిపెట్టుకొంటుంది. ఆ మాతృహృదయంలో క్షోభ తనకు తెలుసు. కాని తెలిసి తను చేయగలిగిందేమిటీ? నాన్నకు ఎప్పుడూ తన దిగులే. గడ్డంమీద చేతు

లుంచుకొని భూదేవివంక చూస్తూ నిశ్శబ్దంగా ఆలోచిస్తూ పుట్టెడు దుఃఖాన్ని మనస్సులో దాచేసుకోవటం ప్రతినిత్యమూ తాను చూస్తూన్నదృశ్యమే! వాళ్ళేం చేస్తారు! వాళ్ళదగ్గర డబ్బులేనప్పుడు తన కోసం వాళ్ళెందుకు అలా నరకబాధ అనుభవించాలీ? నవమాసాలు మోసి, పెంచి పెద్ద చేసి ఒక యింటిదానిగా పంపి సుఖపడమన్నందుకు శిక్షా అదీ? ... ఏమో!

"అక్కయ్య; గౌరివాళ్ళ బావొచ్చాడే ఎంతమంచి పరికిణీ తెచ్చాడనుకున్నావ్!" అని వొగర్చుకొంటూ వచ్చి చెప్పి వెళ్ళింది చెల్లాయి. తనబావకూడా అలాంటి బొమ్మలూ, పరికిణీలు తేవాలనే ఆశతో. పిచ్చిపిల్ల! అందరి హృదయాల్లోఅమృతం వుండదనే రహస్యం ఆ పసి హృదయానికేం తెలుసూ?

భావిని గూర్చి తాను కట్టుకున్న మేడలు విరిగి మీదపడి హృదయాన్ని గాయపరుస్తాయని తను ఊహించిందా? ఏమీలేదు. —తియ్యటి సుఖస్వప్నాలు మాయమయ్యాక కేవలం మోడులామిగిలిపోయింది తాను. ఎండిన పూలవనంలో కోర్కెలు చివురించే ఆశయింకలేదు. తన బ్రతుకు పతనమైంది. ఎవరికోసం బ్రతకాలి యింక? తనబ్రతుకు భూమికే భారం. తన వల్ల యితరులకు బాధ, వ్యసనం తప్ప యింకేమీ కలుగవు.

భర్త విడిచిన స్త్రీకి యీ లోకంలో మోక్షంలేదు. ఆమె ఎంత పవిత్రంగా బ్రతుకుతున్నా పతితగా ఆమెను హేళన చేస్తుంది సంఘం. ఇక సానుభూతి ఎక్కడిదీ?

భారతి ఊహలు పరిపరి విధాల పోతున్నాయి. ఏ ఒక్కటీ గమ్యాన్ని చేరుకోలేక మళ్ళీ తిరిగి వొస్తున్నాయి... అదాట్న ఆమెలో ఒక ఆలోచన మెఱుపులా మెరిసింది... తను ఎవరిహింసకు, అపవాదుకు గురికావాలో వారిని శాశ్వతంగా విడిచిపోతే?...

ఆమె వొళ్ళు ఝల్లుమంది. ఆమె భయంతో వొణికిపోయింది. ఒంటిమీద స్వేద బిందువులు తొంగిచూశాయి. మనో నేత్రాల్లో ఏడుస్తున్న అమ్మ గోచరించింది. పిచ్చిగా, గోడకేసి తల బాదుకొంటున్న నాన్న కన్నీటి ఘోష వినిపించింది. ఘోరం! తనకోసం ఏడ్చేవారిని మరింత ఏడ్పించడమేనా తన బాధ్యత? ఎంత స్వార్థం! ఎంత కృతఘ్నత!

ఈ నేరం దేవుడైనా సహిస్తాడా?

తనచావుకు ఏదో అపవిత్రాన్ని అంటగట్టుతుంది లోకం. అదిచేసే విలయనాట్యానికి, సింహగర్జనలకు అమ్మానాన్న తల దిమ్మెక్కుతుంది. వాళ్ళబ్రతుకు దుర్భరమైతే తన దారే చివరికి శరణ్యమౌతుంది.

...పాపం! అశుభం శుభం తెలియని చెల్లాయి ...దిక్కులేని పక్షిలా...

ఇక ఆలోచించలేక పోయింది. ఆమె కళ్ళు జేవురించాయి. ఆమె చెక్కిళ్ళు కన్నీళ్ళతో తడిసి పోయ్యాయి. ఆమెలో రేగిన తుపాను తాకిడికి ఆమెహృదయం ఛిన్నా భిన్నమైపోయింది. గట్టిగా తల పట్టుకొని మొదలు నరికిన చెట్టులా కూలి పోయింది, పాపం ఆ అభాగిని.

అంతలో ఏదో చప్పుడైంది. అమ్మా నాన్నా పరుగెత్తుకొచ్చారు. వాకిట్లో ఏదో బండి వచ్చి ఆగింది. భారతి కాసేపటికి కనురెప్పలు విప్పింది. తన కళ్లు తానే నమ్మ లేక పోయింది! ఎదురుగా తన భర్త నవ్వుతూ జాలిగా తన కళ్ళల్లోకి చూస్తు న్నాడు. భారతి కళ్ళుమలుముకొంది... తన భర్తే!...ఆమె నివ్వెర పోయింది. నోటమాటరాలేదు.

అతను దగ్గరగా వచ్చి చేతులందుకొని "నీకోసం వచ్చా భారతీ!" అన్నాడు మెల్లగా, - లాలనగా.

భారతి మాట్లాడలేదు.

"మనం వెళదాం" అన్నాడు హృద యం స్పందించే పశ్చాత్తప్త స్వరంతో.

ఈ సారి భారతి పెదవి కదిలించి "ఎక్కడకీ?" అన్నది అయోమయంగా.

"మన యింటికి" అన్నాడు భర్త ధీమాగా-నిర్మలంగా ఆమెను ఆహ్వానిస్తూ

భారతి అశ్రుపూర్ణనయనాల్లో ఆయన కేదో విపంచికా స్వరం వినిపించింది. అది వినోదగీతమో-విషాద గీతమో చెప్పలేం!

